సాక్షి
నిర్మల్

సోమవారం ৷ 8 ৷ సెప్టెంబర్ ৷ 2025



కొలిక్కి వచ్చినట్లేనా? 8లో▸

చెన్నూర్ ఎస్‌బీఐ–2 బ్రాంచ్‌లో జరిగిన కుంభకోణం కేసులో 90శాతం పురోగతి ఉంది. రెండ్రోజుల్లో పూర్తిస్థాయిలో ఆభరణాలు రికవరీ చేసే అవకాశమున్నట్లు సమాచారం.



మొరం తవ్వకాల అడ్డగింత

లక్ష్మణచాంద మండలం పార్‌పెల్లి శివారు భీమన్న, గోసమోడి గుట్టల వద్ద పలువురు అక్రమంగా మొరం తవ్వకాలు చేపట్టారు. తవ్వకాలను గుర్తించిన గ్రామస్తులు అడ్డుకున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.0 /24.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న భవాని

నిర్మల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు సత్తా చాటాలని కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు భవాని పిలుపునిచ్చారు. ఆదివారం నర్సాపూర్(జీ)మండల కేంద్రంలోని గురడిరెడ్డి కాపు సంఘ భవనంలో మహిళా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అందరూ సమష్టిగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు అపర్ణ, జనరల్ సెక్రటరీ శ్రీలతారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ అజీమ్, నాయకులు కొండ్ర రమేశ్, ఉమామహేశ్వర్, గోపిడి గంగారెడ్డి, గజ్జారాం, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

కర్ర గణేశుడి హుండీ లెక్కింపు



హుండీ డబ్బులు లెక్కిస్తున్న సభ్యులు

తానూరు: నవరాత్రోత్సవాల్లో భాగంగా మండలంలోని భోసిలో నెలకొల్పిన కర్ర గణేశుడి హుండీ ఆదాయాన్ని ఆదివారం మహాదేవుని ఆలయ ఆవరణలో లెక్కించారు. 11రోజులు ఉత్సవాలు నిర్వహించగా రూ.లక్షా 56వేల 550 నగదు, 18 తులాల వెండి, 2 మాసాల 2 గురిజెల బంగారం, భక్తులు ముడుపుల రూపంలో సమర్పించిన రూ.58వేల విలువైన వెండి సమకూరింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉత్తం బాలేరావ్, వీడీసీ అధ్యక్షుడు బాలాజీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపకరణాల అర్హుల గుర్తింపు



గుర్తింపు పత్రాలు ఇస్తున్న ప్రవీణ్‌కుమార్

నిర్మల్ రూరల్: సమగ్ర శిక్ష, అలింకో ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో 0–18 ఏళ్ల దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల గుర్తింపు, నిర్ధారణ శిబిరం నిర్వహించారు. నిర్మల్ డివిజన్‌లోని 12మండలాల నుంచి సుమారు 120మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. వీరిలో ఉపకరణాలు అవసరమయ్యే విద్యార్థులను అలింకో సంస్థ నుంచి వచ్చిన సాంకేతిక నిపుణులు గుర్తించారు. త్వరలోనే ఉపకరణాలు అందజేస్తామని తెలిపారు. జిల్లా విలీన విద్య సమన్వయకర్త ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎంపికైన విద్యార్థులకు త్వరలోనే ఉపకరణాలు వస్తాయని పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధి రాజాబాబు, విలీన విద్య రిసోర్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సందడిగా 'గాజుల సవ్వడి'



వేడుకల్లో పాల్గొన్న మహిళలు

నిర్మల్: ఎప్పుడూ వంటిల్లు, ఇంటి పనుల్లో బిజీగా ఉండే మహిళలు తమను తాము ఉత్సాహపరుచుకునేందుకు గాజుల సవ్వడి వేడుక జరుపుకొన్నారు. ఆదివారం నర్సాపూర్(జీ) మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఓ కాలనీ మహిళలు ఒక్కచోట చేరి చేతులకు మెహందీ పెట్టుకుని పసుపు–కుంకుమ, వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. అనంతరం ఒకరికొకరు కొత్త గాజులు ధరించి రోజంతా ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేస్తూ స్టీల్ ప్లేట్లలో భోజనం చేశారు. స్నేహబంధాన్ని పెంచుకునేందుకు వేడుక జరుపుకొన్నట్లు తెలిపారు.

గజ్జలమ్మకు పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండల కేంద్రంలోని గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

విద్యాశాఖ గాడినపడేనా?

- ఏడాదికాలంలో నాలుగో డీఈవో
- కొత్త విద్యాధికారిగా జిల్లావాసి
- భోజన్న ఎదుట ఎన్నో సవాళ్లు
- సంఘాల పెత్తనాన్ని తగ్గిస్తారా?
- ఆ సార్లను బడిబాట పట్టిస్తారా?
- 'పది'లో మళ్లీ ఫస్ట్‌ర్యాంక్ తెస్తారా?



డీఈవో భోజన్నకు బాధ్యతలు అప్పగించి సన్మానిస్తున్న రామారావు, కార్యాలయ అధికారులు

నిర్మల్: 'డీఈవో సార్.. ఇయ్యాల మన బడికి అస్తుండట..' అని అటెండర్ చెప్పడమే ఆలస్యం.. ఆ ఒక్క బడే కాదు.. మండలం మొత్తం అలర్ట్ అయ్యేది. జిల్లాబాస్ వచ్చి తమ ఊళ్లు దాటిపోయేదాకా సార్లందరూ అటెన్షన్‌గా ఉండేవాళ్లు. కానీ.. ఇదంతా గతం. ఇప్పుడు కొన్ని సంఘాల నేతలు విద్యాశాఖ జిల్లా కార్యాలయంలోనే ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. తరగతి గదుల్లో పాఠాలు చెప్పాల్సిన సార్లు డీఈవో ఎదుటే రాజకీయాలు చేస్తున్నారు. కొన్నేళ్లుగా జిల్లా విద్యాశాఖ పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. గతేడాది యూబిట్, విద్యార్థులపై వేధింపులు లాంటి ఘటనల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు జైలు ఊచలు లెక్కపెట్టారు. బదిలీలు, పోస్టింగ్‌లు, సర్దుబాట్లు.. ఇలా ఏ అంశమైనా గత కొన్నేళ్లుగా విద్యాశాఖలో రచ్చకు దారితీస్తోంది. ఇలాంటి శాఖను కొత్త డీఈవో దర్శనం భోజన్న గాడిన పెడతారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పరువుతీసిన ఘటనలెన్నో..

కేవలం.. పదోతరగతి ఫలితాల్లో ఉత్తమం అనిపించుకున్న జిల్లా విద్యాశాఖ రెండేళ్లలో చాలా విషయాల్లో పరువు తీసుకుంది. యూబిట్ వ్యవహారం ఒక్కటి చాలు.. జిల్లా విద్యాశాఖలో నిర్లక్ష్యం, నిర్లిప్తత ఏ స్థాయిలో పేరుకుపోయాయో చెప్పడానికి. పది, ఇరవై మంది కాదు.. ఏకంగా వందల్లో ఉపాధ్యాయులు కాసుల కక్కుర్తిలో పడి బడిని, తరగతి గదిని, తమపైనే ఆశలు పెట్టుకున్న విద్యార్థులనూ గాలికొదిలేశారు. పాఠాలు చెప్పాల్సిన చోట.. సెల్‌ఫోన్‌లో 'కాయిన్'ల లెక్కలు వేసుకున్నారు. చివరకు కొందరు మా'స్టార్లు' ఊచలు లెక్కపెట్టేదాకా వెళ్లారు. ఇక బడి ముఖం చూడకుండా రియల్‌ఎస్టేట్, ఫైనాన్స్‌లు అంటూ తిరిగే సార్ల సంఖ్య లెక్కనే లేదు. ఇవన్నీ ఒకెత్తయితే.. సొంతబిడ్డల్లా చూసుకోవాల్సిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తించడం మరీ దారుణం. ఏడాదికాలంలోనే ఎన్నో ఆరోపణలతో ముగ్గురు డీఈవోలు నియమితులయ్యారు. గత నవంబర్‌లో రవీందర్‌రెడ్డి తర్వాత నియమితులైన నాగజ్యోతి జిల్లాకు కూడా రాలేదు. అనంతరం రామారావు నియమితులయ్యారు. తాజాగా జిల్లాకే చెందిన భోజన్న బాధ్యతలు స్వీకరించారు.

ఇష్టారీతిన సంఘాల తీరు

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జిల్లా విద్యాశాఖలో సంఘాల పెత్తనం ఆరోపణలకు తావిస్తోంది. కొందరు ఉపాధ్యాయులు బోధన బాధ్యతలు గాలికొదిలేసి, సంఘాల పేరుతో రాజకీయాలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఉపాధ్యాయ వ్యవస్థ ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి ఉపయోగపడాల్సిన సంఘాన్ని వ్యక్తిగత పనుల కోసం వాడుకుంటున్న తీరుపై తోటి ఉపాధ్యాయులే మండిపడుతున్నారు. గత డీఈవోలు కొంతమంది సంఘాల నేతలు వ్యవహరించిన తీరు జిల్లా విద్యాశాఖ ప్రతిష్టను దిగజార్చాయన్న వాదనా ఉంది. ఇలాంటి వాటిపైనా కొత్త డీఈవో దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

తనిఖీలు అంతంతే..

ఒకప్పుడు డీఈవో తనిఖీకి వస్తున్నారని తెలియగానే సార్లంతా విద్యార్థులను ముందుగానే ప్రిపేర్ చేసేవారు. ఏ ప్రశ్న అడిగినా సమాధానం చెప్పేలా తయారు చేసేవారు. డీఈవోలు కూడా ఆకస్మికంగా తనిఖీలు చేస్తూ.. బడుల్లో అవసరాలే కాదు.. విద్యార్థుల పఠన నైపుణ్యాలనూ పరీక్షించేవారు. జిల్లాలో ఇలాంటి సందర్భాలు చాలా తక్కువ. జిల్లా అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, తప్పులు చేసినవారిపై చర్యలు తీసుకోకపోవడంతో చాలామంది ఉపాధ్యాయులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. రూ.లక్షల్లో వేతనాలు పొందుతున్నా.. కనీసం వృత్తికి న్యాయం చేయని ఉపాధ్యాయులూ ఉన్నారు.

మళ్లీ 'ప్రథమం' రావాలి

జిల్లా రెండేళ్లపాటు వరుసగా పదోతరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. గతేడాది మాత్రం ఆ స్థానాన్ని కోల్పోయింది. విద్యావ్యవస్థలో ఎన్నిలోపాలు, ప్రతికూలతలున్నా.. అంతకుమించి ఉత్తములైన ఉపాధ్యాయులూ ఉన్నారు. చాలామంది విద్యార్థుల కోసమే నిత్యం శ్రమిస్తున్నవాళ్లూ ఉన్నారు. ఇలాంటి వారిని గుర్తించి మరింత ప్రోత్సహించాలి. ప్రత్యేక తరగతులు, పర్యవేక్షణలతో జిల్లాను మళ్లీ ప్రథమస్థానంలో నిలుపాల్సిన బాధ్యత కూడా కొత్త డీఈవోపైనే ఉంది. దారితప్పిన విద్యాశాఖను భోజన్న గాడిన పెట్టాలని, సర్కారు బడి విద్యార్థిగా ఆ బడిని నమ్ముకున్న విద్యార్థులకు అండగా నిలవాలని జిల్లావాసులు ఆశిస్తున్నారు.

శాయశక్తులా కృషిచేస్తా

బడిపిల్లల భవిష్యత్ కోసం అందరం కృషిచేయాల్సిన అవసరముంది. కలెక్టర్, ఉన్నతాధికారుల సహకారంతో విద్యాశాఖ సమష్టిగా పనిచేస్తోంది. గత అనుభవాలతో జిల్లా విద్యావ్యవస్థను మెరుగుపరిచేందుకు శాయశక్తులా కృషిచేస్తా. విద్యారంగంలో జిల్లాను ముందుంచే ప్రయత్నం చేస్తా.

– డీ భోజన్న, జిల్లా విద్యాధికారి

కేజీబీవీ విద్యార్థినులకు ఊరట

- అమలులోకి పెంచిన కాస్మోటిక్ చార్జీలు
- జిల్లాలో 6,449 మందికి ప్రయోజనం



సోన్ కస్తూర్బా బాలికల విద్యాలయం

లక్ష్మణచాంద: కేజీబీవీ విద్యార్థినులకు ఊరట లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన కాస్మోటిక్ చార్జీలు ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేయనుంది. ఈ మేరకు ఉన్నతాధికారుల సూచన ప్రకారం జూన్, జూలై, ఆగస్టు మాసాలకు సంబంధించిన విద్యార్థినుల వివరాలు, బ్యాంక్ ఖాతాల వివరాలు ఇదివరకే ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు కేజీబీవీల ఎస్వోలు తెలిపారు. జిల్లాలో 18 కేజీబీవీలుండగా 6–10 తరగతులు చదువుతున్న విద్యార్థినులు 4,696 మంది ఉన్నారు. 16 కేజీబీవీ జూనియర్ కళాశాలలుండగా 1,753 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఇలా మొత్తం కేజీబీవీల్లో 6,449 మంది విద్యార్థినులున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన నూతన కాస్మోటిక్ చార్జీల ప్రకారం 6, 7 తరగతుల బాలికలకు నెలకు రూ.175 చొప్పున, 8, 9, 10 తరగతులు, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థినులకు రూ.275 చొప్పున 10నెలలపాటు అందిస్తారు. కాగా, కాస్మోటిక్ చార్జీల పెంపు అమలు కానుండగా కేజీబీవీ విద్యార్థినులు హర్షం వ్యక్తంజేస్తున్నారు.

వివరాలు నమోదు చేశాం



పెంచిన కాస్మోటిక్ చార్జీలు ఈ విద్యాసంవత్సరం నుంచి అమలవుతాయి. విద్యార్థినుల వివరాలు ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమవుతాయి.

– సలోమి కరుణ, సెక్టోరియల్ అధికారి

నెలనెలా జమచేయాలి



ప్రభుత్వం అందజేస్తున్న కాస్మోటిక్ చార్జీలను రెండు మూడు నెలలకోసారి కాకుండా నెలనెలా చెల్లిస్తే బాగుంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతీనెల చార్జీలు చెల్లించేలా చూడాలి.

– లక్ష్మి, విద్యార్థిని, లక్ష్మణచాంద కేజీబీవీ

సంతోషంగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కేజీబీవీ విద్యార్థినులకు కాస్మోటిక్ చార్జీలు పెంచింది. పెంచిన చార్జీలు ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేయాలని నిర్ణయించడం సంతోషంగా ఉంది.

– భవ్యశ్రీ, విద్యార్థిని, లక్ష్మణచాంద కేజీబీవీ

నేలకూలిన విద్యుత్ స్తంభాల పరిశీలన



కూలిన స్తంభాలను పరిశీలిస్తున్న శ్రీనివాస్

దస్తురాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదతో గోదావరి తీరానగల మండలంలోని దేవునిగూడెం, భూత్కూర్, రాంపూర్ గ్రామాల్లో చాలాచోట్ల విద్యుత్ స్తంభాలు నేల కూలినట్లు ఇన్‌చార్జి ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. గోదావరి తీర ప్రాంతాల్లో నేల కూలిన విద్యుత్ స్తంభాలు, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఆదివారం పరిశీలించారు. 82 విద్యుత్ స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా సోమవారం నుంచి మరమ్మతు పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆయనవెంట లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, రైతులున్నారు.

రెండోరోజూ గణేశ్ నిమజ్జనం



వినాయకసాగర్‌కు గణపతి విగ్రహాలతో నిమజ్జనానికి వచ్చిన భక్తులు

- 24 గంటలపాటు శోభాయాత్ర



శోభాయాత్రలో గణనాథులు

నిర్మల్ టౌన్: బై బై గణేశా.. అంటూ జిల్లా కేంద్రంలో శనివారం మధ్యాహ్నం మొదలైన వినాయక నిమజ్జనోత్సవం ఆదివారం రాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. బుధవార్‌పేట్ ఒకటో నంబర్ గణపతి వద్ద శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ఎస్పీ జానకీ షర్మిల పూజలు చేసి నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు. 24 గంటలు శోభాయాత్ర కొనసాగి ఆదివారం మధ్యాహ్నం ఒకటో నంబర్ గణపతి నిమజ్జనం పూర్తయింది. కన్నుల పండువగా సాగిన గణనాథుల శోభాయాత్ర చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. స్థానిక నగరేశ్వరవాడ చౌరస్తాలో గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి తదితరులు వినాయకులకు స్వాగతం పలికారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు వాటర్ ప్యాకెట్లు, ప్రసాద ప్యాకెట్లు పంపిణీ చేశారు. భాగ్యలక్ష్మి బాంబే హార్ట్ రెస్టారెంట్ ఆధ్వర్యంలో మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. నిమజ్జనోత్సవాన్ని విజయవంతం చేయడానికి వివిధ శాఖలు నిర్విరామంగా శ్రమించాయి. దాదాపు రెండురోజులు రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్ శాఖల అధికారులూ రోడ్లపైనే విధులు నిర్వహించారు. ఎస్పీ జానకీ షర్మిల నేతృత్వంలో శోభాయాత్రను ప్రశాంతంగా పూర్తి చేసేందుకు పకడ్బందీ భద్రత చర్యలు చేపట్టారు.



నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు



నీటిలో నిమజ్జనమవుతున్న గణపతి విగ్రహం

యూరియా కోసం రైతుల ఆందోళన



పీఏసీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

ఖానాపూర్: యూరియా కోసం పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎదుట ఆదివారం రైతులు ఆందోళనకు దిగారు. ఖానాపూర్ పీఏసీఎస్‌కు యూరియా స్టాక్ వచ్చిన విషయం తెలిసి రైతులు వేకువజామునే ఆధార్, పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులతో అక్కడికి చేరుకున్నారు. మధ్యాహ్నం వరకు అక్కడే పడిగాపులు కాశారు. లారీలో వచ్చిన 444 బస్తాల యూరియాను పోలీస్ బందోబస్తు మధ్య ముందుగా వచ్చినవారికి అధికారులు పంపిణీ చేశారు. యూరియా దొరకని సుమారు 200 మంది రైతులు ఆందోళనకు దిగారు. తమకు యూరియా ఎప్పుడిస్తారని పీఏసీఎస్ అధికారులను నిలదీశారు. రెండు మూడు రోజుల తర్వాత స్టాక్ రాగానే ఇస్తామని పీఏసీఎస్ సీఈవో భూమి ఆశన్న చెప్పారు. అయితే యూరియా దొరకని వారికి టోకెన్లు ఇచ్చి మళ్లీ స్టాక్ వచ్చాక ముందుగా ఇవ్వాలని రైతులు కోరారు. అధికారులు టోకెన్లు ఇవ్వలేమని చెప్పగా నిరాశతో వెనుదిరిగారు. సకాలంలో యూరియా అందక పంటల ఎదుగుదల లోపిస్తోందని వాపోయారు. సరిపడా యూరియా సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

యోగాను జీవనశైలిలో భాగం చేసుకోవాలి

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధిక
- ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు
- జాతీయ స్థాయికి ఏడుగురి ఎంపిక



విజేతలకు సర్టిఫికెట్లు ఇస్తున్న జడ్జి రాధిక, నిర్వాహకులు

నిర్మల్‌రూరల్: విద్యార్థులు, యువత జీవన శైలిలో యోగాను భాగం చేసుకోవాలని, యోగాతో శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధిక పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని దివ్యగార్డెన్స్‌లో మూడురోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలు ఆదివారం ముగిసాయి. ముఖ్య అతిథిగా హాజరైన రాధిక మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని తెలిపారు. విద్యార్థి దశనుంచే యోగాపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. 24 జిల్లాల నుంచి 658 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు.

జిల్లా నుంచి విజేతలు వీరే..

ఆదివారం ముగిసిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా నుంచి ఏడుగురు విద్యార్థులు ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. శ్రీరఘునా, ఆకృతి, సాత్విక్, చరణ్, యువరాజ్, రితేశ్, అవంతిక జిల్లా నుంచి ఎంపికైనవారిలో ఉన్నారు. వీరంతా వచ్చే నెలలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు దేవేందర్‌రెడ్డి, జగన్నాథం, యోగా భారత్ రాష్ట్ర కార్యదర్శి నందనం కృపాకర్, యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ, రోహిణి, సుశ్వేత, టోర్నమెంట్ డైరెక్టర్ తోట సతీశ్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన టీం మేనేజర్లు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలకు రక్షణేది?



భవనంలో ధ్వంసమైన వస్తువులు

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో 110 ఎకరాల సర్కారు భూముల్లో నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలకు రక్షణ కరువైంది. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన భవనాలు ప్రారంభించి వదిలేయడంతో పర్యవేక్షణ కరువైంది. ఇవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. కొందరు ఆకతాయిలు భవనాల్లోని వస్తువులను ధ్వంసం చేస్తున్నారు. గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం గేట్లు విరగ్గొట్టారు. భవనం చుట్టూ ఉన్న కిటికీలు, వాటి అద్దాలు పగులగొట్టారు. రెండురోజులు క్రితం దాని పక్కనే ఉన్న గిరిజన భవనం తలుపులు పగులగొట్టిన దుండగులు లోనికి చొరబడి ఫ్యాన్లు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారు. స్విచ్ బోర్డులు ధ్వంసం చేశారు. ఆకతాయిలు, దుండగుల చర్యలపై ఉన్నతాధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



పగిలిన కిటికీ అద్దం

శ్రీనివాస్‌కు స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు



బెస్ట్ టీచర్ అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్ గణిత ఉపాధ్యాయుడు జాడి శ్రీనివాస్ స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్నారు. అంకితభావంతో పనిచేస్తున్న శ్రీనివాస్‌ను లయన్స్‌క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ వారు ఎంపిక చేసి ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 'బెస్ట్ టీచర్ అవార్డు'తో సత్కరించారు. 15 ఏళ్ల సర్వీస్‌లో కడెం మండలం లింగాపూర్, ఖానాపూర్ మండలం మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లలో ఎన్ఎంఎంఎస్ గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. 185 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక కావడానికి కృషి చేశారు. అదనపు తరగతులు నిర్వహిస్తూ, సొంత డబ్బులతో విద్యార్థుల సంక్షేమానికి చేస్తున్న కృషికిగాను అతడిని ఈ అవార్డు వరించింది. క్లబ్ గవర్నర్ అమర్నాథ్, మాజీ ఐఏఎస్ లక్ష్మీనారాయణ తదితరుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కాగా, ఈ నెలలో న్యూఢిల్లీలో ఈఎన్‌పీ–2020పై నిర్వహించనున్న జాతీయ స్థాయి శిక్షణలోనూ తెలంగాణ నుంచి ప్రభుత్వం 10మందిని ఎంపిక చేయగా అందులో శ్రీనివాస్ ఉండడం గమనార్హం.

పేదల కోసమే జీఎస్టీ సంస్కరణలు



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

లోకేశ్వరం: పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేసేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జీఎస్టీలో సంస్కరణలు తీసుకువచ్చిందని బీజేపీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని స్వామి వివేకానంద కూడలిలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సుమన్‌కుమార్ మాట్లాడుతూ.. పేదల వికాసం కోసమే నరేంద్ర మోదీ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. వ్యవసాయ పరికరాలు, సిమెంట్‌పై జీఎస్టీ భారీగా తగ్గించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సాయన్న, నాయకులు శ్రీధర్, చిన్నారావు, జయసాగర్‌రావు, రాజశేఖర్, శ్రీనివాస్, సాయితేజగౌడ్, రెడ్డిశెట్టి శ్రీనివాస్, భూమేశ్ తదితరులున్నారు.

క్లుప్తంగా

అంబులెన్స్‌లో ప్రసవం



జన్మనిచ్చిన ఆడపిల్లతో తల్లి

ఇచ్చోడ: బజార్‌హత్నూర్‌ మండలం సోనేరావు గూడ గ్రామానికి చెందిన జయమాల అనే గర్భిణి అంబులెన్స్‌లో ప్రసవించింది. ఆదివారం ఆమెకు పురిటినొప్పులు రావడంతో భర్త చరణ్‌దాస్‌ అంబులెన్స్‌ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని ఆమెను ఇచ్చోడ పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికమయ్యాయి. అంబులెన్స్‌ను రోడ్డు పక్కన నిలిపి ఈఎంటీ శశికాంత్‌ ఆమెకు ప్రసవం చేయగా ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను ఇచ్చోడ పీహెచ్‌సీకి తరలించారు. ఈఎంటీ శశికాంత్‌, పైలెట్‌ జైసింగ్‌లకు మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

క్షుద్రపూజల కలకలం

కెరమెరి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో క్షుద్రపూజల కలకలం రేపింది. గత కొంత కాలంగా పలు ప్రాంతాల్లో కుంకుమ, అగర్‌వత్తులు, నిమ్మకాయలతో పూజలు చేసినట్లు ఆనవాళ్లు కనిపించాయి. తాజాగా శనివారం రాత్రి ఓ ఇంటి ఎదుట నిమ్మకాయ, గుడ్డు ఉండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎవరికి హానీ చేయాలని ఇలా చేస్తున్నారు? లేదా గుప్తనిధుల కోసం ఇలా చేస్తున్నారో తెలియడం లేదని అంటున్నారు.

ఎడ్యుకేషన్‌ లోన్‌ పేరిట మోసం

మందమర్రిరూరల్‌: ఎడ్యుకేషన్‌ లోన్‌ పేరిట యువకుడు మోసపోయిన ఘటన మందమర్రిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్‌ కథనం ప్రకారం.. మూడవ జోన్‌కు చెందిన యువకుడు ఆన్‌లైన్‌లోని ఓ వెబ్‌సైట్‌లో రూ.50 వేల ఎడ్యుకేషన్‌ లోన్‌ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఆ వెబ్‌సైట్‌ నుంచి యువకుడి వివరాల సేకరణలో భాగంగా లోన్‌ ఆమోదం అయిందని నమ్మించి అతని ఆధార్‌, పాన్‌కార్డు, వ్యక్తిగత వివరాలు, ఖర్చులకు రూ.37,500 చెల్లించాలని చెప్పారు. డబ్బులు చెల్లించిన తర్వాత లోన్‌ రాకపోయేసరికి మోసపోయానని గ్రహించాడు. వెంటనే సైబర్‌ క్రైం హెల్ప్‌లైన్‌ నంబర్‌ 1930కి ఫిర్యాదు చేయగా ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు యువరైతు మృతి



చిక్రం లింగు (ఫైల్‌)

నేరడిగొండ: అడవి పందుల బారి నుంచి పంట కాపాడుకునేందుకు కాపలా వెళ్లిన యువ రైతు పాముకాటుకు గురై మృతి చెందాడు. మండలంలోని గాజిలి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అనసూయ–వెంకట్‌ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గ్రామంలో పదెకరాల వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రెండో కుమారుడు యువ రైతు చిక్రం లింగు (20) బుధవారం రాత్రి వారి పంట కాపలా కోసం అక్కడికి వెళ్లాడు. గురువారం ఉదయం ఇంటికి రాకపోయేసరికి కుటుంబీకులు వెళ్లి చూడగా లింగు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానిక వైద్యుడికి చూపించగా, మెరుగైన వైద్యం కోసం 108లో ఆదిలాబాద్‌ రిమ్స్‌కు తరలించారు. శనివారం రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఆదిలాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆదిలాబాద్‌ టౌన్‌: పట్టణంలోని తిర్పెల్లి సమీపంలో గల రైల్వేస్టేషన్‌ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు టూటౌన్‌ సీఐ నాగరాజు తెలిపారు. రైల్వే సిబ్బంది సమాచారం ఇవ్వడంతో ఆదివారం సంఘటన స్థలానికి చేరుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్ల వరకు ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్‌ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు చెప్పారు. ఎవరైన మృతదేహాన్ని గుర్తుపడితే టూటౌన్‌ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

గ్రహణం ఎఫెక్ట్‌.. ఆలయాలు మూసివేత

'గూడెం' వద్ద..



దండేపల్లి: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు దండేపల్లి మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ప్రధాన ఆలయంతోపాటు, అనుబంధ ఆలయాలను మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈవో శ్రీనివాస్‌ పేర్కొన్నారు.



మూసివేసిన శ్రీ లక్ష్మీ నారాయణస్వామి ఆలయం

జైనథ్‌లో

జైనథ్‌: మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి ఆదివారం ఉదయం 10:30 గంటలకు మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం 4:00 గంటలకు తెరవనున్నారు. గ్రహ సంప్రోక్షణ, అనంతరం స్వామివారికి హారతి కార్యక్రమం తర్వాత 6 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం ఉంటుందని ఈవో చంద్రశేఖర్‌ తెలిపారు.

మూసివేసిన కాల్వ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రధాన ద్వారం



దిలావర్‌పూర్‌లో..

దిలావర్‌పూర్‌: మండలంలోని ప్రధాన ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. స్థానిక ఏకనాథుని, రేణుక ఎల్లమ్మ, నవాంజనేయ, శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వర, కాల్వ పరిసర అటవీ ప్రాంతంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాలను అర్చకులు మూసివేశారు. సోమవారం సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కలుగజేస్తామని ఆలయ వర్గాలు వెల్లడించాయి.

కొలిక్కి వచ్చినట్లేనా..

- చెన్నూర్‌ ఎస్బీఐ కేసులో పురోగతి
- 19 కిలోల బంగారు ఆభరణాలు రికవరీ?
- రెండురోజుల్లో పూర్తి రికవరీకి అవకాశం
- కోర్టు ద్వారా బ్యాంక్‌కు అప్పగించనున్న పోలీసులు



చెన్నూర్‌ ఎస్బీఐ

చెన్నూర్‌: చెన్నూర్‌ ఎస్బీఐ–2 బ్రాంచిలో కుంభకోణం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 20 కిలోల బంగారు ఆభరణాలు, రూ.1.10 కోట్ల నగదు కుంభకోణ కేసును పక్షం రోజుల్లో రామగుండం సీపీ నేతృత్వంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్‌, జైపూర్‌ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చెన్నూర్‌ సీఐ దేవేందర్‌రావు 90 శాతం పురోగతి సాధించినట్లు తెలిసింది. పోలీసులు సుమారు 19 కిలోల బంగారు ఆభరణాలు రికవరీ చేసినట్లు తెలిసింది. ఈనెల 3 నుంచి 6 తేదీ వరకు గణేశ్‌ నిమజ్జనంలో పోలీసు అధికారులు బిజీబిజీగా ఉన్నారు. సోమవారం పనిదినాలు కావడంతో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో బంగారు అభరణాలు రికవరీ చేసే అవకాశం ఉందని సమాచారం.

రికవరీ బంగారం కోర్టు ద్వారానే..

పోలీసులు పూర్తిస్థాయిలో రికవరీ చేసిన బంగారు ఆభరణాలను కోర్టులో అప్పగిస్తారని తెలిసింది. బ్యాంక్‌ లీగల్‌ అడ్వయిజర్‌ బ్యాంక్‌లో మాయమైన ఆభరణాల వివరాలను కోర్టుకు అప్పగించి స్వాధీనం చేసుకుంటారని సమాచారం. ఇదంతా పక్షం రోజులు పడుతుందని తెలిసింది. కోర్టు ద్వారా బ్యాంక్‌ స్వాధీనం చేసుకున్న తర్వాత బాధితుల వారీగా నగలు పరిశీలించాల్సి ఉంటుంది. 20 కిలోల బంగారు ఆభరణాలు కావడంతో 402 మంది బాధితులకు సంబంధించినవి వేరు చేయాలంటే రెండు నెలలు పట్టే అవకాశం ఉందని బ్యాంక్‌ అధికారులు అంటున్నారు.

నేడు బ్యాంక్‌ ఎదుట ఆందోళన?

ఎస్బీఐలో గోల్డ్‌ రికవరీ అయిన తర్వాత ఆభరణాలు ఎప్పుడిస్తారనే అనుమానం బాధితులను వెంటాడుతుంది. పూర్తిస్థాయిలో అధికారులు తమకు ఎప్పుడిస్తారనే సమాచారం లేక సోమవారం బ్యాంక్‌ ఎదుట ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని పలువురు బాధితులు చర్చించుకుంటున్నట్లు తెలిసింది.



దిగువకు వెళ్తున్న నీరు

కడెం ప్రాజెక్ట్‌ గేటు ఎత్తివేత

కడెం ప్రాజెక్ట్‌ గరిష్ట నీటిమట్టానికి చేరుకుంది. ఆదివారం ఉదయం ప్రాజెక్ట్‌కు 4402 క్యూసెక్కుల ఇన్‌ ఫ్లో వస్తుండడంతో ఒక వరద గేటు ఎత్తి 4,053 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 699.450 అడుగులుగా ఉంది. – కడెం



నిండుకుండలా 'ఎల్లంపల్లి'

ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టులతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరదతో ఎల్లంపల్లి జలాశయం నిండుకుండలా మారింది. ఆదివారం ప్రాజెక్ట్‌ నీటిమట్టం 148 మీటర్ల క్రస్ట్‌ లెవెల్‌కు గాను 147.58 మీటర్లకు 148, 20.175 టీఎంసీలకు గాను 20.175 టీఎంసీలతో ఉంది. ఇన్‌ఫ్లో కింద 1,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా అవుట్‌ ఫ్లో కింద హైదరాబాద్‌ మెట్రో వాటర్‌ వర్క్స్‌ పథకానికి 315 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. 2 గేట్లు తెరిచి 1,185 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెడుతున్నారు. – మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌)

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్‌

- 16 తులాల బంగారు ఆభరణాలు అప్పగింత

లక్ష్మణచాంద: పోగొట్టుకున్న ఆభరణాలు, నగదును బాధితురాలికి అప్పగించి ఆటోడ్రైవర్‌ నిజాయితీ చాటుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి..కడెం మండల కేంద్రానికి చెందిన కొంక సుజాత ఖానాపూర్‌లో ఆరోగ్యమిత్రగా విధులు నిర్వహిస్తోంది. ఆమె కుమార్తె వివాహానికి 16 తులాల బంగారు ఆభరణాలు నిర్మల్‌లో చేయించింది. శనివారం కుమారుడితో కలిసి బంగారు ఆభరణాలు తీసుకుని బైక్‌ పక్కన బ్యాగులో ఉంచి మధ్యాహ్నం కడెంకు బయల్దేరారు. ఈక్రమంలో బ్యాగు ఎక్కడో పడిపోయింది. ఈ విషయమై సోషల్‌ మీడియాలో పోస్టు చేశారు. లక్ష్మణచాంద మండలం రాచాపూర్‌కు చెందిన ఆటోడ్రైవర్‌ తక్కల సాయికుమార్‌ నిర్మల్‌ నుంచి లక్ష్మణచాంద వెళ్తున్నాడు. నిర్మల్‌రూరల్‌ మండలం కొండాపూర్‌ ఫ్లెటోవర్‌ సమీపంలో 61వ జాతీయ రహదారిపై బ్యాగు పడి ఉండడాన్ని గమనించి ఇంటికి తీసుకెళ్లాడు. సోషల్‌ మీడియాలో చూసిన సాయికుమార్‌ ఆదివారం బాధితురాలి వివరాలు తెలుసుకున్నాడు. రాచాపూర్‌లో 16 తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును ఆమెకు అందించారు. బ్యాగు అందించి నిజాయితీ చాటిన సాయికుమార్‌ను సుజాత కుటుంబ సభ్యులు, పలువురు అభినందించారు.



సుజాతకు బంగారు ఆభరణాలు అందిస్తున్న ఆటోడ్రైవర్‌ సాయికుమార్‌

డ్రగ్స్‌ ముఠా వెనుక కాంగ్రెస్‌ హస్తం

- బీఆర్‌ఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌

కాగజ్‌నగర్‌రూరల్‌: డ్రగ్స్‌ ముఠా వెనుక కాంగ్రెస్‌ నాయకుల హస్తం ఉండటంతోనే చూసీచూడనట్లు వదిలేస్తున్నారని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ ఆరోపించారు. హైదరాబాద్‌లోని చర్లపల్లిలో రూ.12వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ ఓ కంపెనీలో పట్టుబడటం దారుణమని, దీనికి బాధ్యత వహిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్‌ చేశారు. కాగజ్‌నగర్‌ మండలం కోసినిలోని ఆయన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహారాష్ట్ర పోలీసులు నెల రోజుల పాటు కాపుకాసి అన్ని ఆధారాలతో దాడులు చేసి డ్రగ్స్‌ పట్టుకున్నారని, తెలంగాణ పోలీస్‌ వ్యవస్థ పూర్తిగా విఫలమైందన్నారు. డ్రగ్స్‌ మొక్క ఎక్కడ ఉన్నా గద్దలా పీకేస్తామని, దీని కోసం ఈగల్‌ అనే ఈ కొత్త డిపార్ట్‌మెంట్‌ ప్రారంభిస్తామని చెప్పిన సీఎం చర్లపల్లిలో డ్రగ్స్‌ ఎందుకు పట్టుకోలేదని ప్రశ్నించారు.

ఎస్పీఎం కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

సిర్పూర్‌ పేపరుమిల్లులో కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ డిమాండ్‌ చేశారు. ఇటీవల మిల్లు ప్రమాదంలో ఎన్నం భాస్కర్‌ అనే కాంట్రాక్టు కార్మికుడు గాయపడిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. మిల్లు నుంచి వచ్చే విషవాయువులతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు శ్యాంరావు, కొంగ సత్యనారాయణ, వెంకటేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న హిందుత్వ వాదులు, ఛత్రపతి శివాజీ అభిమానులు, కాంగ్రెస్‌ నేతలు

మంచిర్యాలటౌన్‌: మంచిర్యాలలో శనివారం వినాయక నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌ రావుపై అసత్య ఆరోపణలు చేసిన మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుపై చర్యలు తీసుకోవాలని హిందుత్వవాదులు, ఛత్రపతి శివాజీ అభిమానులు, కాంగ్రెస్‌ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం మాట్లాడారు. గణేశ్‌ నిమజ్జనాన్ని హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించగా, వేదికపైకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అసత్యపు మాటలతో రాజకీయ వేదికగా మార్చి, విద్వేషాలతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యేతోపాటు అనుచరులపై మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఎస్జీఎఫ్‌ క్రీడలు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఆడే రామేశ్వర్‌

ఇచ్చోడ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా త్వరలో నిర్వహించే ఎస్జీఎఫ్‌ క్రీడలను విజయవంతం చేయాలని ఆదిలాబాద్‌ జిల్లా కార్యదర్శి ఆడే రామేశ్వర్‌ కోరారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో క్రీడాజట్ల ఎంపిక పోటీల నిర్వహణపై చర్చించారు. 43 క్రీడాంశాల్లో 14, 17 ఏళ్ల విభాగం బాలుర, బాలికల జోనల్‌ వేదికలు ఖరారు చేసినట్లు తెలిపారు. జట్ల ఎంపికను పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయ, క్రీడా సంఘాలు, పీడీ, పీఈటీలు, సహకారంతో పోటీలు విజయవంతం చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో మంచిర్యాల, నిర్మల్‌, ఆసిఫాబాద్‌ జిల్లాల ఎస్జీఎఫ్‌ కార్యదర్శులు ఎండీ యాకుబ్‌, రవీందర్‌ గౌడ్‌, వెంకటేశ్‌, ఆదిలాబాద్‌, నిర్మల్‌ జిల్లా వ్యాయమ విద్యా ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.పార్థసారథి, ఋక్యా రమేశ్‌, కె.భోజన్న, సాయికుమార్‌, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మూడు ఆలయాల్లో చోరీ



అగ్గిమల్లన్న ఆలయంలో హుండీని పగులగొట్టిన దొంగలు

ఖానాపూర్‌: పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంతోపాటు తర్లపాడ్‌లోని ఓంకారేశ్వర, అగ్గిమల్లన్న ఆలయాల్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో 6 సీసీ కెమెరాలు, డీవీఆర్‌, 4 గ్రాముల పుస్తెలు, ఓంకారేశ్వర ఆలయంలో సీసీ కెమెరాతో పాటు హుండీలో నగదు, కానుకలు, అగ్గిమల్లన్న ఆలయంలో హుండీని పగులగొట్టి నగదు, కానుకలను దొంగలు ఎత్తుకెళ్లారు. పట్టణంలోని శివాజీనగర్‌ కాలనీకి చెందిన సూదం శ్రీనివాస్‌ బైక్‌ను దొంగిలించారు. ఆలయకమిటీ సభ్యుల ఫిర్యాదులపై కేసులు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాహుల్‌ గైక్వాడ్‌ తెలిపారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

జైపూర్‌: సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్‌ చేశారు. ఇందారం ఐకే–ఓసీపీలో ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కాంట్రాక్ట్‌ వర్కర్స్‌ యూనియన్‌ బెల్లంపల్లి రీజియన్‌ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్‌, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్‌ అలీతో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. తాము గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడే కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత, వైద్య సౌకర్యం, మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. ఆ తర్వాత వచ్చిన గుర్తింపు సంఘాలు కనీసం వారిని పట్టించుకోలేదన్నారు. తాము తిరిగి మళ్లీ గుర్తింపు సంఘంగా గెలిచిన వెంటనే పర్మినెంట్‌ కార్మికులకు మాదిరిగా వారికి లాభాల్లో వాటాగా రూ.5 వేలు ఇప్పించినట్లు తెలిపారు. హైపవర్‌ కమిటీ వేతనాలు, చట్టబద్ధమైన లీవు, సిక్‌, జాతీయ పండుగల సెలవులు ఇవ్వాలని సంస్థను కోరినట్లుగా తెలిపారు. అనంతరం ఓపెన్‌కాస్టులో పని చేస్తున్న కార్మికులు ఏఐటీయూసీలో చేరగా వారిని యూనియన్‌లోకి ఆహ్వానించారు.



కండువా కప్పుతున్న సీతారామయ్య

పాపికొండలను తలపిస్తున్న 'కడెం'

- హైకోర్టు జడ్జి సృజన



బోటింగ్‌ చేస్తున్న సృజన, కుటుంబీకులు

కడెం: కడెం ప్రాజెక్ట్‌ అందాలు బాగున్నాయని, పాపికొండలను తలపిస్తుందని హైకోర్టు జడ్జి సృజన అన్నారు. శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో కడెం వచ్చారు. బృందావన్‌ రిసార్ట్స్‌లో విడిది అనంతరం ఆదివారం ఉదయం కడెం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఆయకట్టు, వరద గేట్లు, నీటిమట్టం తదితర వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మిషన్‌ భగీరథ ఇంటెక్‌వెల్‌ను పరిశీలించారు. ప్రాజెక్ట్‌లో కుటుంబ సభ్యులతో కలిసి బోటింగ్‌ చేశారు. ఆమె వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి, ఆర్‌ఐ శారద, రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్‌ సిబ్బంది ఉన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్‌ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

రెబ్బెన: రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా అండర్‌–14 బాల్‌ బ్యాడ్మింటన్‌ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలకు సుమారు 30 మంది బాలికలు, 20 మంది బాలుర హాజరయ్యారు. అనంతరం క్రీడాకారులకు పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఈనెల 13 నుంచి 14 వరకు జనగామ జిల్లా కూనురులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని బాల్‌ బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి ఎస్‌.తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, సీనియర్‌ క్రీడాకారులు నరేశ్‌ పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్‌ నాయకులు

ఎంపికైన క్రీడాకారులు

ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్‌ బాలిక జట్టుకు ఎం.సహాస్ర, టి.ప్రజ్వలశ్రీ, పి.శ్రావ్య,ఎస్‌.సాయిశ్రీ వర్షిణి, డి.వేరోనికా, జి.హన్నా, పి.సిరి, బి.రాజేశ్వరి, పి.పవిత్ర, ఎండీ అల్ఫీన, ఎస్‌.రిషిత, డి.నందిని, ఎస్‌.విజయస్ఫూర్తి, ఎండీ జేబా, బాలుర జట్టుకు వరుణ్‌, నిఖిల్‌, ఎం.కృష్ణ లోకనందు, సీహెచ్‌ అఖిల్‌, బి.రాఘవ, బి.ఆంజనేయులు, కె.స్టీఫెన్‌, జె.అశ్విన్‌, ఎం.తిరుపతి, సీహెచ్‌ అరవింద్‌, డి.విష్ణు వర్ధన్‌, ఎం.త్రిచూర్‌ కృష్ణ ఎంపికయ్యారు.

సెపక్‌తక్రా ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం సెపక్‌తక్రా ఉమ్మడి జిల్లా సీనియర్‌ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైనవారు ఈనెల 20 నుంచి 22 వరకు మహబూబ్‌నగర్‌ జిల్లా వనపర్తిలో పాలిటెక్నిక్‌ కళాశాలలో జరగబోయే అంతర్‌ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని అసోషియేషన్‌ ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్‌ కార్యదర్శి కుమ్మరి మల్లేశ్‌ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, క్రీడాకారులు నరేశ్‌, దిలీప్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు..

సెపక్‌తక్రా ఉమ్మడి జిల్లా సీనియర్‌ పురుషుల జట్టుకు ఆడే రాజేందర్‌, ఆర్‌.వెంకటేశ్‌, చందు, రాజశేఖర్‌, రాందాస్‌, మహిళల జట్టుకు టి.అనూష, కె.స్ఫూర్తి కారుణ్య, జె.నేహశ్రీ, అభినవ రమ్య, కె.శ్రీవల్లి ఎంపికయ్యారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అసోషియేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఒలింపిక్‌ అసోసియేషన్‌ జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఆర్‌.నారాయణరెడ్డి, సెపక్‌తక్రా అసోషియేషన్‌ సంయుక్త కార్యదర్శి శిరీష, ఎగ్జిక్యూటివ్‌ మెంబర్‌ కె.భాస్కర్‌, ఆర్‌.రామకృష్ణ, జి.శ్రీధర్‌, పి.సాంబయ్య అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులు

ఎదురెదురుగా ఢీకొన్న రెండు కార్లు

ముధోల్‌: మండలంలోని తరోడా గ్రామం వద్ద ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై బిట్లాపెర్సిస్‌ కథనం ప్రకారం.. నిజామాబాద్‌ జిల్లా రెంజల్‌ మండలం నీల గ్రామానికి చెందిన బలరాం, వర్ని మండలానికి చెందిన అనసూయ ఆదివారం భైంసా నుంచి నిజామాబాద్‌కు కారులో వెళ్తున్నారు. నిజామాబాద్‌ నుంచి భైంసాకు నవ్యశ్రీ, అనురాధ కారులో వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. బలరాం, అనుసూయలకు తీవ్రగాయలై ఇద్దరి కాళ్లు విరిగాయి. నవ్యశ్రీ, అనురాధలకు స్వల్పగాయాలయ్యాయి. ఘటన స్థలానికి ఎస్సై చేరుకుని క్షతగాత్రులను భైంసా ఏరియాస్పత్రికి తరలించారు.